సాక్షి
అన్నమయ్య జిల్లా
శనివారం । 4 । నవంబర్ । 2023



అగస్త్యేశ్వరాలయంలో చోరీ

పురాతన గుండ్లూరు అగస్త్యేశ్వరాలయంలో ముగ్గురు దుండగులు చొరపడి చోరీకి పాల్పడ్డారు. వారిని అడ్డుకోబోయిన వృద్ధుడిపై దాడి చేశారు. -IIలో



కళ్లెదుటే కుమార్తె మృత్యుఒడిలోకి

బి.కొత్తకోటకు చెందిన అజ్మా(2) ఆటోలో వెళుతున్న తల్లి చేతి నుంచి జారిపడి ఆమె కళ్లెదుటే మృత్యుఒడిలోకి చేరింది. సత్య సాయి జిల్లాలో ఈ ఘటన జరిగింది. -IIలో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.240	రూ.312
రెండోరకం	రూ.140	రూ.280



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 251 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	517	517
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 76.82 కిలోలు

న్యూస్‌రీల్

క్రికెట్ జట్టు ఎంపిక



ఉమ్మడి జిల్లా అండర్ 17 స్కూల్ గేమ్స్ బాల బాలికల క్రికెట్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

వాల్మీకిపురం: వాల్మీకిపురం జీవీఎస్‌సీఎస్ క్రికెట్ మైదానంలో అండర్-17 బాలబాలికల క్రికెట్ జట్టును ఎంపిక చేసినట్లు అన్నమయ్య జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి వసంత తెలిపారు. ఉమ్మడి జిల్లా నలమూలల నుంచి 250 మంది పాల్గొన్నారన్నారు. ప్రతిభను చూసి 40మంది బాలలు, 24 మంది బాలికలను గుర్తించామన్నారు. ఎంపిక చేసిన వారికి 3 రోజులు పోటీలు నిర్వహించి రాణించిన వారితో జట్టు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు మౌళి, శ్రీధర్, నాగరాజు, నరేష్, రియాజ్, రమేష్, ఉమా, యోగేష్, ఉదయ్, సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సామర్థ్యం అంచనాకు పరీక్ష



విద్యార్థితో మాట్లాడుతున్న డీఈఓ రామ్ పురుషోత్తం

కలికిరి: విద్యార్థులలో అభ్యసనా సామర్థ్యం పెంపొందించేందుకు పరీక్షలు నిర్వహించినట్లు డీఈఓ రామ్ పురుషోత్తం అన్నారు. కలికిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు, ఆంగ్లం, గణితం పరి/జ్ఞానంపై 26 పాఠశాలల్లో 918 మంది 3, 6, 9 తరగతుల విద్యార్థులకు పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. స్టేట్ ఎడ్యుకేషన్ ఎచీవ్‌మెంట్ సర్వే-2023 ప్రకారం వెనుకబడిన విద్యార్థులలో అభ్యసన సామర్థ్యాన్ని పెంపొందించాలని ఉపాధ్యాయులకు ఆయన సూచించారు. అనంతరం పాఠశాలలోని నాడు-నేడు పనులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కరీముల్లా, హెచ్‌ఎం శారద, సీఆర్‌పీ సురేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిద్దవటంలో వర్షం

కడప అగ్రికల్చర్: వాతావరణంలో ఏర్పడిన మార్పుల కారణంగా జిల్లాలో మూడు మండలాల్లో వర్షం కురిసింది. సిద్దవటంలో 7.2 మిల్లీమీటర్లు, బి.మఠంలో 1.2 , దువ్వూరులో 3.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

వర్షసూచన: వాతావరణంలో చోటు చేసుకున్న మార్పుల దృష్ట్యా ఈ నెల 4వ తేదీ నుంచి 8వ తేదీ వరకు వైఎస్సార్ జిల్లాలోని పలు మండలాల్లో ఒక మాదిరి నుంచి తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉంది. ఈ విషయాన్ని కృషి విజ్ఞాన కేంద్ర కో ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య, కేవీకే వాతావరణ విభాగ శాస్త్రవేత్త స్వామి చైతన్యలు తెలిపారు. ఈ వర్షం రైతులకు మేలు చేస్తుందని వారు తెలిపారు.

క్వార్టర్‌ఫైనల్ చేరిన ఏపీ వాలీబాల్ జట్టు



క్వార్టర్ ఫైనల్ చేరిన ఏపీ వాలీబాల్ జట్టు

కడప స్పోర్ట్స్: శ్రీనగర్ (జమ్మూకాశ్మీర్)లో నిర్వహిస్తున్న ఆలిండియా ఎస్‌జీఎఫ్ అండర్-17 వాలీబాల్ పోటీల్లో ఏపీ బాలుర జట్టు క్వార్టర్ ఫైనల్‌కు చేరింది. మధ్యప్రదేశ్ జట్టుపై విజయం సాధించి క్వార్టర్స్‌కు చేరింది. జిల్లాకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు ప్రవీణ్‌కిరణ్ (మేనేజర్), విక్టర్ (కోచ్), మహబూబ్‌బాషా (హెచ్‌ఓడీ)లుగా వ్యవహరిస్తున్న ఏపీ జట్టు చక్కగా రాణిస్తూ క్వార్టర్ ఫైనల్ చేరింది. కాగా రాష్ట్రస్థాయి పోటీలు సైతం జిల్లాలోని మైదుకూరు పట్టణంలో నిర్వహించిన సంగతి తెలిసిందే.

నేటి నుంచి ఓటర్ల స్పెషల్ క్యాంపెయిన్

కడప సెవెన్‌రోడ్స్: వైఎస్సార్ జిల్లాలో ఓటర్ల జాబితాకు సంబంధించి ఈనెల 4, 5 తేదీల్లో స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహిస్తున్నట్లు కడప ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి మధుసూదన్ ఒక ప్రకటనలో తెలిపారు. బూత్ లెవెల్ అధికారులంతా వారికి సంబంధించిన ఓటర్ల జాబితాలతో పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉంటారని తెలిపారు. ప్రత్యేక ఓటరు జాబితా సంక్షిప్త సవరణ కార్యక్రమం -2024లో భాగంగా గతనెల 27వ తేది ముసాయిదా ఓటరు జాబితాను ప్రచురించామన్నారు. సవరణల కోసం ఫారం-8 దరఖాస్తులను ఆన్‌లైన్ పోర్టల్ voters.eci.gov.in వెబ్‌సైట్ ద్వారా లేదా నేరుగా బూత్ లెవెల్ అధికారులకుగానీ, తహసీల్దార్, ఆర్డీఓ కార్యాలయంలోగానీ అందజేయాలని కోరారు.

మునగ సాగుతో..ఉపాధి

ఉద్యాన పంటలకు ఉపాధిహామీ పథకం అండగా నిలుస్తోంది. మహిళా రైతుల్లో ఆత్మస్థైర్యం నింపుతోంది. ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహం సత్ఫలితాలనిస్తోంది. పండ్ల తోటల పెంపకం ద్వారా సన్న, చిన్నకారు రైతు కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేస్తోంది.మరికొందరికి ఉపాధి అవకాశాలను కల్పిస్తోంది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కేటగిరీ 'బి'లో ముగన తోటల పెంపకం సుస్థిర ఆదాయ మార్గాన్ని పెంచుతోంది.





సాగు చేసిన మునగతోట వద్ద రామసుబ్బమ్మ

- ఉపాధిహామీ కింద తోటలపెంపకం
- జాబ్ కార్డు ద్వారా 100 రోజుల పనిదినాలు
- ఆర్థిక భరోసా నింపుతున్న పండ్లతోటలు

సాక్షి ప్రతినిధి, కడప: జాబ్ కార్డు కలిగిన గ్రామీణ కుటుంబానికి ఒక ఆర్థిక సంవత్సరంలో 100 రోజుల పని కల్పించడం ఉపాధి హామీ పథకం ముఖ్య ఉద్దేశం. ఆ పనుల్లో కేటగిరి 'బి'కి సంబంధించి వ్యక్తిగత ఆస్తుల అభివృద్ధి చేసేందకు ఉపాధి హామీ పనులను వ్యవసాయ పనులకు అనుసంధానం చేశారు. ఇందులో భాగంగా 5ఎకరాల లోపు భూమి కలిగిన, విపత్కర పరిస్థితులు ఎదుర్కొంటున్న రైతు కుటుంబాలకు మునగ తోటల పెంపకానికి అవకాశం కల్పించారు. సుస్థిర ఆదాయ మార్గం ద్వారా జీవనోపాధి పెంచడమే లక్ష్యం కావడంతో లాభదాయకంగా ఉంటోంది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అందిస్తున్న ఉపాధి పనులు, రాయితీలు రైతులకు ప్రోత్సాహకంగా మారాయి.

మునగ సాగుతో.. మహిళా రైతు ముందంజ

వైఎస్సార్ జిల్లా కమలాపురం మండలంలోని దేవరాజుపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని జాబ్ కార్డు హోల్డర్ భూమిరెడ్డి రామసుబ్బమ్మ(60) మునగ సాగుతో ఉపాధి పొందుతున్నారు. అతి తక్కువ పెట్టుబడితో, ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీ, ఆర్థిక సహకారంతో తనకున్న చిన్నపాటి 34 సెంట్ల పొలంలో మునగ సాగు చేసి మెరుగైన జీవనోపాధిని పొందుతున్నారు. మునగ తోట పెంపకం కోసం 2022-2023 ఆర్థిక సంవత్సరంలో మహిళా రైతు బి రామసుబ్బమ్మ (జాబ్ కార్డు నెం: 80092) ద్వారా మునగ తోట పెంపకానికి అంచనా వేయగా 0.34 ఎకరాకు గాను 152 మొక్కలను సాగు చేసేందుకు అంచనా మొత్తం రూ. 55,413 లుగా నిర్ణయించారు. ఇందులో వేతనాల కింద రూ. 39,296, 153 పని దినాలు, సామగ్రి కొనుగోలు కింద రూ. 11,260లు, ఇతరత్రా ఖర్చులు రూ. 4,857 ప్రకారం అంచనా వేసి క్షేత్రస్థాయిలో మునగ సాగు పనులను మొదలు పెట్టారు. పెట్టుబడి సాయం దక్కడంతో దిగుబడికి తగ్గ ఫలితాలు రానున్నాయి.

తక్కువ ఖర్చుతో అధిక లాభాలు



వ్యవసాయ పంటలు కలిసిరాక కష్టాల సాగులో కొట్టుమిట్టాడుతున్న రైతన్నలకు ఉపాధి హామీ పథకం అండగా నిలుస్తోంది.రైతులు వ్యవసాయ పొలాల్లో ఉద్యాన పంటలు సాగు చేసేందుకు మక్కువ చూపుతున్నారు. జిల్లాలో వ్యవసాయ పంటలకు అనుకూలంగా లేని రైతులు ఉపాధి హామీ పథకంతో అనుసంధానం చేసిని ఉద్యాన పంటలను సాగు చేసుకుని తక్కువ ఖర్చులతో అధిక లాభాలు పొందవచ్చు.

– విజయరామరాజు, జిల్లా కలెక్టర్, వైఎస్ఆర్ జిల్లా

'ఉపాధి' పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



పని కోరిన వారికి పని కల్పించడం ఉపాధి హామీ పథకం ముఖ్య ఉద్దేశం. ఉద్యాన పంటలకు అనుసంధానం ద్వారా జిల్లాలో 22.70 ఎకరాల్లో మునగ పంట సాగులోకి తెచ్చాం. కమలాపురం మండలంలో జాబ్ కార్డుదారు రామసుబ్బమ్మ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుంటోంది. ఆమెకు ఇప్పటి వరకు 30 పనిదినాలు కల్పించి రూ. 7,426 వేతనం చెల్లించాం. లబ్ధిదారులు ఇంటి సమీపంలోనే ఉన్న కొద్దిపాటి వ్యవసాయ భూమిలో 152 మునగ మొక్కలను పెంచి ప్రస్తుతం వారు దిగుబడిని కూడా అందుకుంటున్నారు. ప్రతి రోజు తోటలో పనులు చేసుకొని జీవనోపాధిని పొందుతున్నారు. ఆసక్తి, అవకాశం ఉన్న సన్న చిన్నకారు రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– పి.యదుభూషణ్ రెడ్డి, పథక సంచాలకులు, వైఎస్ఆర్ జిల్లా, కడప

జిల్లాల పునర్విభజన ప్రచారం నమ్మవద్దు

- ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి



ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

రాయచోటి: జిల్లాల పునర్విభజన మళ్లీ జరుగుతుందన్న నిరాధారమైన ప్రచారాన్ని నమ్మవద్దని వైఎస్సార్సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు. రాయచోటిలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ జిల్లాల పునర్విభజన జరుగుతుందని, అన్నమయ్య జిల్లాను తొలగిస్తారంటూ ప్రాంతాలకు వ్యతిరేకంగాను సామాజిక మాధ్యమాల్లో ప్రచారాలు చేయడం దారుణమన్నారు. రాయచోటిలో జిల్లా కేంద్రం ఉండకూడదనే దురుద్దేశ్యంతో కొందరు విష ప్రచారం చేస్తున్నారన్నారు. నా ఊపిరి ఉన్నంతవరకు రాయచోటి జిల్లా కేంద్రం ఉంటుందని, అడుగు కూడా దాటిపోకుండా చూస్తామన్నారు. శుక్రవారం జరిగిన క్యాబినేట్ సమావేశంలో ఈ అంశంపై ఎలాంటి చర్చ జరగలేదని, ఊహాజనితంగా రాసే వార్తలు నమ్మవద్దన్నారు. రాయచోటి మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా కూడా టీడీపీ చేస్తున్న దుష్ప్రచారాలపై మండిపడ్డారు.

దుష్ప్రచారం తగదు

రాయచోటి అర్బన్: జిల్లాల పునర్విభజన పేరుతో తెలుగుదేశం పార్టీ నేతలు దుష్ప్రచారం చేస్తుండడం తగదని మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్ బాషా అన్నారు. రాయచోటి విలేకరులతో ఆయన మాట్లాడుతూ విద్వేషాలను రెచ్చగొట్టడం సిగ్గుచేటు అన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

చాపాడు: వాతావరణం మార్పుల కారణంగా వ్యాపించే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైఎస్ఆర్ జిల్లా వైద్యాధికారి నాగరాజు పేర్కొన్నారు. మండల కేంద్రమైన చాపాడులో శుక్రవారం ఆయన పర్యటించారు.ఇళ్ల దగ్గరికెళ్లి పరిసరాలను పరిశీలించారు. ఎక్కువ రోజులు నీటిని నిల్వ చేసుకోరాదని, నీటి తొట్లు, టైర్లలో నీరు లేకుండా చేసుకోవాలన్నారు.

భూమిపై సర్వహక్కులు కల్పించాం

కలెక్టర్ గిరీషా పీఎస్

కలికిరి: జిల్లా వ్యాప్తంగా 20 సంవత్సరాల కిందట పంపిణీ చేసిన డీకేటీ భూములకు అనుభవ ధ్రువపత్రాలు అందజేసి రైతులకు సర్వహక్కులు కల్పించామని కలెక్టర్ గిరీషా పీఎస్ పేర్కొన్నారు. కలికిరి మార్కెట్ యార్డు ఆవరణంలో శుక్రవారం 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, అధికారులతో కలిసి ఆయన పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రథమ ప్రాధాన్యం ఇస్తోందన్నారు. కలికిరి మండలంలోని 7వేల ఎకరాల చుక్కల భూములను నిషేధిత జాబితానుంచి తొలగించడమేగాక, క్రయ, విక్రయాలకు వీలు కల్పించామని తెలిపారు. ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యలను జగనన్నకు చెబుదాం ద్వారా క్షేత్ర స్థాయిలో తెలుసుకుని పరిష్కరించేందుకు అధికారులే ప్రజల వద్దకు వచ్చారని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మండల ప్రజలు తమ సమస్యలపై విన్నవించుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్‌తో కలిసి ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. 102 మంది వినతులను పరిశీలించి పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మదనపల్లి ఆర్డీఓ ఎంఎస్.మురళి, డీపీఓ ధనలక్ష్మి, డీఆర్ శంకరయ్య, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ తిమ్మారెడ్డి, ఎంపీపీ నూర్జహాన్, జెడ్పీటీసీ సభ్యురాలు పద్మజ, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీషా పీఎస్

ఎన్నికలకు పకడ్బందీగా ఏర్పాట్లు

రాయచోటి: రానున్న సార్వత్రిక ఎన్నికలు సజావుగా జరిగేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నామని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ తెలిపారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి తమ కార్యాలయం నుంచి కలెక్టర్‌లు, ఎస్పీలతో ఎన్నికల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శుక్రవారం సమీక్షించారు. ఇందులో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ అన్నమయ్య నూతన జిల్లాలో మొదటిసారిగా నిర్వహించే సార్వత్రిక ఎన్నికలలో ఎటువంటి పొరపాట్లకు అవకాశం ఇవ్వకుండా జిల్లా యంత్రాంగం మొత్తం సమన్వయంతోప నిచేయాలని అధికారులకు సూచించామన్నారు. ఓటరు జాబితాకు సంబంధించి ఎటువంటి విమర్శలు రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లాలో సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ల మ్యాపింగ్ అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా కమ్యూనికేషన్ ప్లాన్ తదితర అంశాలపై పటిష్ఠ చర్యలు చేపట్టామన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే అవసరమైన వాటిని సమకూర్చుకుంటామని తెలిపారు. కాగా ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఎస్పీ కృష్ణారావు, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, కేఆర్ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీలేఖ, డీఆర్‌ఓ సత్యనారాయణ, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

26 గ్రామాల ప్రజల కల సాకారం



భూమిపూజ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ మిథున్‌రెడ్డి, చిత్రంలో ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు

- రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి
- రూ.11కోట్లతో రైల్వే వంతెన పనులు

రైల్వేకోడూరు: నియోజకవర్గంలో రూ.11 కోట్లతో రైల్వే భూగర్భ వంతెన పనులు చేపట్టడంతో 26 గ్రామాల ప్రజల కల సాకారమైందని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. రైల్వేకోడూరు పట్టణ పరిధిలోని కురుగుంటపల్లి సమీపంలో రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులను శుక్రవారం వారు భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రేన్ సాయంతో ఎంపీ, ప్రభుత్వ విప్‌లకు భారీ గజమాల వేసి స్థానికులు ఘన స్వాగతం పలికారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎంపీ, ప్రభుత్వ విప్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నారని, ఇందులో భాగంగానే దశాబ్దాలుగా కలగా మిగిలిన రైల్వే భూగర్భ వంతెన నిర్మాణం ఇపుడు చేపడుతున్నారన్నారు. ఎన్నో సంవత్సరాలుగా వంతెన కోసం రైల్వేకోడూరు వాసులు ఎదురుచూస్తున్నారని, టీడీపీ నాయకులు పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేశారని విమర్శించారు.సీఎం ప్రత్యేక చొరవతో పనులకు టెండర్లు పిలిచారన్నారు. వంతెన నిర్మాణానికి నిధులు సాధించేందుకు కేంద్ర మంత్రులను సంప్రదించి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఎంతో కృషి చేశారన్నారు. రాజంపేట నుంచి కోడూరు వరకు రూ.90 కోట్లతో మరో తొమ్మిది రైల్వే వంతెనలు నిర్మించనున్నామన్నారు. కేంద్ర మంత్రి గడ్కరీతో మాట్లాడి రూ.2200 కోట్ల రుపాయలతో ఎక్స్‌ప్రెస్ హైవే, రూ.89 కోట్లతో రైల్వే అండర్ బ్రిడ్జిలు మంజూరు చేయించడం జరిగిందన్నారు. వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి వినతి మేరకు టూ వే అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ వంతెనతో అలాగే 2 వేల మంది విద్యార్థులకు, 26 గ్రామాల ప్రజలకు ఎంతో సౌకర్యం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అక్కిరెడ్డి, కొల్లం గంగిరెడ్డి, పంజం సుకుమార్‌రెడ్డి, ధ్వజారెడ్డి, హేమనవర్మ, ఆర్సీ.సురేష్‌బాబు, దార్ల చంద్రశేఖర్, బండి పిచ్చిరెడ్డి, ప్రవీణ్ రెడ్డి, భరత్‌కుమార్‌రెడ్డి, సీడీ.నాగేంద్ర, ప్రశాంతి రమేష్, లింగం లక్ష్మీకర, భాస్కర్‌నాయుడు, సుధాకర్‌రాజు, రత్నమ్మ, రమేష్ వర్మ, సుధర్శన్‌రాజు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప కోటిరెడ్డిసర్కిల్: ఏపీఎస్ ఆర్టీసీలో ఐటీఐ చేసిన వివిధ ట్రేడులకు సంబంధించిన అభ్యర్థులు అప్రెంటీస్ చేసేందుకు ఈనెల 15వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని కర్నూలు జోనల్ సిబ్బంది శిక్షణా కళాశాల ప్రిన్సిపాల్ నజీర్ అహ్మద్ తెలిపారు. వైఎస్సార్ జిల్లాలో డీజల్ మెకానిక్ 47 మంది, మోటారు మెకానిక్ 8, ఎలక్ట్రిషియన్ 4, వెల్డర్ 1, పెయింటర్ 1, మిషనిస్టు 2, ఫిట్టర్ 2, డ్రాఫ్ట్ మెన్ సివిల్ 2 కలిపి మొత్తం 67 మంది దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు www.apprenticeshipindia.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

డిజిటల్ వెంబడి



'ప్రతి పిల్లోడు గొప్ప గొప్ప చదువులు చదవాలి. ప్రతి ఇంటి నుంచి పెద్ద పెద్ద ఇంజనీర్లు, డాక్టర్లు రావాలి. మనం పిల్లలకు ఇచ్చే గొప్ప ఆస్తి చదువు ఒక్కటే. ఎన్ని అవాంతరాలు ఎదురైనా మీ మేనమామ నేను చదివిస్తాను. మీరు చదవండి' అంటూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి పేద విద్యార్థులకు వెన్నుదన్నుగా నిలిచారు. అధికారంలోకి వచ్చిన వెంటనే నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు సమూలంగా మార్చేశారు. పనులు పూర్తయిన పాఠశాలల్లో డిజిటల్ విద్యకు కావాల్సిన సరంజామాను సమకూర్చారు. పేద పిల్లలు ప్రపంచంతో పోటీపడేలా తీర్చిదిద్దుతున్నారు.



మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఐఎఫ్‌పీ పై పాఠ్యాంశానికి సంబంధించి వివరిస్తున్న, రాస్తున్న విద్యార్థి

- ప్రభుత్వ బడుల్లో దృశ్య విద్య
- ఐఎఫ్‌పీ ప్యానల్స్, స్మార్ట్ టీవీలు పంపిణీ
- పాఠశాలలకు 4జీ ఇంటర్నెట్ సౌకర్యం
- నాడు-నేడుతో మారిన రూపురేఖలు
- విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యం మెరుగు

ఉన్నత పాఠశాలలు :	180
ఐఎఫ్‌పీ ప్యానల్స్ :	1113
ప్రాథమిక పాఠశాలలు:	223
స్మార్ట్ టీవీలు :	335



మదనపల్లె సిటీ: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 1వ తరగతి నుంచే స్మార్ట్ క్లాస్ రూములు అందుబాటులోకి వచ్చాయి. నాడు బ్లాక్ బోర్డులపై సాగిన బోధన నేడు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ (ఐఎఫ్‌పీ), స్మార్ట్ టీవీల్లో కొనసాగనుంది. జిల్లా వ్యాప్తంగా నాడు-నేడు పనులు పూర్తి చేసుకున్న పాఠశాలలకు మొదటి విడతగా 180 ఉన్నత పాఠశాలల్లో 1113 ఐఎఫ్‌పీ ప్యానల్స్, 223 ప్రాథమిక పాఠశాలల్లో 335 స్మార్ట్ టీవీలను ప్రభుత్వం సరఫరా చేసింది. ఆయా పాఠశాలలకు 4జీ ఇంటర్నెట్ సౌకర్యం కల్పించింది. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్య అభ్యసిస్తున్న విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యం మెరుగైంది. నాడు-నేడు రెండోదశ పూర్తవ్వగానే మిగిలిన పాఠశాలలకు ఈ పరికరాలు అందజేయనున్నారు.

స్మార్ట్ బోధన సాగేదిలా...

తరగతి గదిలో ఉపాధ్యాయుల సమక్షంలో దృశ్య రూపంలో స్మార్ట్ టీవీలు, ఐఎఫ్‌పీ ప్యానెల్స్ ద్వారా పాఠ్యాంశాలను బోధిస్తారు. ఐఎఫ్‌పీ ప్యానెల్స్‌ను డిజిటల్ విద్యకే గాక బ్లాక్ బోర్డులా ఉపయోగించుకునే వెసులుబాటు ఉంది. దానిపై రాసిన వాటిని తుడిపేయవచ్చు. అలాగే వాటిని సేవ్ చేసుకునే అవకాశం ఉంటుంది. ఇంటర్నెట్ వినియోగించుకుని కంప్యూటర్‌లాగా ఈ తెరపై యూట్యూబ్, ఫోన్, ట్యాబ్‌లోని సమాచారాన్ని స్క్రీన్‌పై చూస్తూ పాఠం నేర్పవచ్చు. తద్వారా సులువుగా అర్థం చేసుకోవచ్చు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్మార్ట్ టీవీ ద్వారా విద్యా బోధన సులభమవుతుంది.

నైపుణ్యం మెరుగు



దృశ్య, శ్రవణ రూపంలో జరిగే విద్యా బోధనతో విద్యార్థులు సులువుగా పాఠ్యాంశాలు నేర్చు కుంటారు. సబ్జెక్టుపై పట్టు సాధిస్తారు. వీటి ద్వారా విద్యార్థులు చాలా ఆసక్తితో పాఠాలను నేర్చుకుంటారు.

– శ్రీరాం పురుషోత్తం, డిఈఓ, అన్నమయ్య జిల్లా

అభ్యసనా సామర్థ్యం మెరుగు



ఐఎఫ్‌పీ ప్యానల్‌తో పిల్లల్లో అభ్యసనా సామర్థ్యం మెరుగైంది. దీంతోపాటు ఆండ్రాయిడ్ బాక్స్, 4జీ ఇంటర్నెట్ ఇవ్వడంతో పాఠ్యాంశాలకు సంబంధించిన వీడియోలను డౌన్‌లోడ్ చేసుకుని వాటిని ప్లే చేసుకోవచ్చు. ప్రభుత్వ పాఠశాలల్లో అమలుచేస్తున్న డిజిటల్ విద్యతో విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పోటీపడతారనడంలో సందేహం లేదు.

– సుబ్బారెడ్డి, హెచ్‌ఎం, జెడ్పీహెచ్ఎస్, మదనపల్లె

సులువుగా అర్థమవుతోంది



ఇది వరకంటే ఇప్పుడు ఉపాధ్యాయులు చెబుతున్న పాఠాలు సులువుగా అర్థమవుతున్నాయి. ఐఎఫ్‌పీ ప్యానల్‌లో వీడియోలను ప్లే చూసి చూపుతున్నారు. దీని వల్ల పాఠాలు చక్కగా అర్థమవుతున్నాయి.

– అమీర్‌ఖాన్, 8వ తరగతి, జెడ్పీహెచ్ఎస్, మదనపల్లె

నిజాయితీ చాటుకున్న వ్యక్తి


ఎస్ఐ సమక్షంలో బాధితురాలికి నగదు అందజేస్తున్న రాజ్ పురోహిత్

లక్కిరెడ్డిపల్లి : తనకు దొరికిన రూ.50 వేలను అప్పగించి.. ఓ వ్యక్తి నిజాయితీ చాటుకున్నాడు. మండల కేంద్రంలోని వేంపల్లి రోడ్డులో ఉన్న సాయిరాం స్వీట్స్ అండ్ బేకరీలో శుక్రవారం అంబికా ఫ్యాన్సీకి చెందిన ఉమేద్ సింహ్ రాజ్ పురోహిత్‌కు ఒక ప్లాస్టిక్ కవర్ దొరికింది. అందులో రూ.50 వేలను గమనించి.. ఆ కవర్‌ను తీసుకొని లక్కిరెడ్డిపల్లె పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాడు. నగదు పోగొట్టుకున్న మహిళను ఎస్ఐ మల్లికార్జునరెడ్డి పిలిపించి నగదు అందజేశారు. దీంతో బాధితురాలితోపాటు పోలీసులు అతన్ని అభినందించారు.

కళ్లెదుటే కుమార్తె మృత్యుఒడిలోకి..

రోడ్డు ప్రమాదంలో చిన్నారి మృతి


మృతి చెందిన చిన్నారి అజ్మా

మదనపల్లె : తల్లిదండ్రుల కళ్లెదుటే కుమార్తె మృత్యుఒడిలోకి చేరింది. దీంతో వారు గుండెలవిసేలా రోదించారు. వివరాలు ఇలా ఉన్నాయి. బి.కొత్తకోటకు చెందిన చాంద్‌బాషా, ఆయేషా దంపతులు తమ కుమార్తె అజ్మా(2)తో కలిసి శ్రీ సత్యసాయి జిల్లాలోని కదిరిలో బంధువుల ఇంటికి వెళ్లారు. తిరిగి వారితో కలిసి శుక్రవారం ఆటోలో మదనపల్లెకు బయలుదేరారు. మార్గంమధ్యలో శ్రీ సత్యసాయి జిల్లా తనకల్లు పోలీస్‌స్టేషన్ పరిధిలో స్పీడ్ బ్రేకర్‌ను గమనించకుండా ఆటోను వేగంగా నడపడంతో.. వెనుక వైపున కూర్చున్న ఆయేషా చేతిలో నుంచి కుమార్తె అజ్మా జారి రోడ్డుపై పడిపోయింది. ఈ ప్రమాదంలో చిన్నారి తీవ్రంగా గాయపడగా, వెంటనే మదనపల్లెలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు సూచనలతో ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తీసుకువచ్చారు. పరీక్షించిన వైద్యులు పాప అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

వృద్ధుడి అదృశ్యం


యర్రమరెడ్డి (ఫైల్)

కేవీపల్లె : వృద్ధుడి అదృశ్యంపై కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలిలా వున్నాయి. మండలంలోని ఎంపీపల్లె పంచాయతీ కుంటిమేకలపల్లెకు చెందిన కె. యర్రమరెడ్డి (65) ఈ నెల 2న బట్టలు ఇస్త్రీ చేయించుకోవడానికి అని గర్నిమిట్టకు వెళ్లాడు. సాయంత్రం అయినా ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గర్నిమిట్ట పరిసర గ్రామాలు, బంధువుల ఇళ్ల వద్ద గాలించినా ఆచూకీ తెలియలేదు. దీంతో శుక్రవారం కేవీపల్లె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. యర్రమరెడ్డికి కొద్దిగా మతిస్థిమితం లేదని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లోకేష్ తెలిపారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి

ములకలచెరువు : రైలు కిందపడి ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. కదిరి రైల్వే ఎస్ఐ రహీం కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. బి.కొత్తకోటకు చెందిన రాజ్ మహమ్మద్ అలియాస్ ధోని(40) కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం మండల కేంద్రంలోని కదిరి రోడ్డు షాది మహల్ వద్ద రైల్వేట్రాక్‌పై మృతదేహం పడి ఉండడంతో.. స్థానికులు గమనించి కదిరి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని గుర్తించి రాజ్ మహమ్మద్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం నిమిత్తం కదిరి ప్రభుత్వ హాస్పిటల్‌కు మృతదేహాన్ని తరలించారు.

ట్రాక్టర్‌పై నుంచి పడి..

మదనపల్లె : మద్యం మత్తులో ట్రాక్టర్‌లో నుంచి అదుపుతప్పి కిందపడి ఓ వ్యక్తి తీవ్రగాయాల పాలైన సంఘటన శుక్రవారం గుర్రంకొండ మండలంలో జరిగింది. ఎల్లుట్ల గ్రామానికి చెందిన రమణ కుమారుడు ఎస్.మల్లికార్జున(45) వ్యవసాయం చేసుకుంటూ, ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తూ జీవిస్తున్నాడు. శుక్రవారం మద్యం మత్తులో ట్రాక్టర్‌తో పొలంలో పనులు చేస్తుండగా, అదుపుతప్పి ట్రాక్టర్ కిందపడ్డాడు. చక్రం మీదుగా వెళ్లడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. వెంటనే గమనించిన కుటుంబ సభ్యులు తిరుపతి ఆస్పత్రికి తీసుకెళ్లారు. గుర్రంకొండ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జూదరుల అరెస్ట్

ములకలచెరువు : పేకాట ఆడుతున్న శిబిరంపై పోలీసులు దాడులు నిర్వహించి ముగ్గురు జూదరులను అరెస్ట్ చేసి, రూ. 41 వేలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ గాయత్రి తెలిపారు. మండలంలోని నాయనచెరువు పల్లె వద్ద శుక్రవారం దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

చోరీ కేసులో జైలు శిక్ష

ములకలచెరువు : చోరీ కేసులో నిందితుడికి కోర్టు ఏడాది పాటు జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించింది. ఎస్ఐ గాయత్రి వివరాలు వెల్లడించారు. 2022లో ములకలచెరువులోని ఒక దుకాణంలో రూ.రెండు లక్షల విలువ చేసే రాగి వైరు దొంగతనం జరిగింది. దుకాణ యజమాని మతిన్ బాషా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్ఐ డీవై స్వామి దర్యాప్తు చేసి అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన ధనకుమార్ (40)ను అరెస్ట్ చేసి రిమాండ్ తరలించారు. తంబళ్లపల్లి కోర్టులో శుక్రవారం నేరం రుజువు కావడంతో జూనియర్ సివిల్ జడ్జి ఎ.ఉమర్ ఫారూఖ్ నిందితుడికి శిక్ష విధించారు. ఏడాది పాటు జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

గుండ్లూరు అగస్త్యేశ్వరాలయంలో చోరీ

అడ్డుకోబోయిన వృద్ధుడిపై దాడి


డబ్బు అపహరించి హుండీ పడేసి వెళ్లిన దృశ్యం


గాయపడిన వెంకటేశు

రాజంపేట : చెయ్యేటి ఒడ్డున స్వయంభుగా వెలసిన మట్లిరాజుల కాలం నాటి పురాతన గుండ్లూరు శ్రీ అగస్త్యేశ్వరాలయంలో శుక్రవారం తెల్లవారుజామున ముగ్గురు దుండగులు చోరీకి పాల్పడ్డారు. అడ్డుకోబోయిన వృద్ధుడు వెంకటేశు(70)ను చితకబాది.. యేటి ఒడ్డున పడేసి వెళ్లిపోయారు. ఆయనతోపాటు పూజారి శివ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఆలయం వద్ద కొన్నేళ్లుగా కాపలదారునిగా వెంకటేశు ఉన్నారు. ఆయన స్వామి వారి మండపంలో నిద్రిస్తున్నాడు. రెండు గంటల ప్రాంతంలో ముగ్గురు వ్యక్తులు వచ్చారు. వారిని వెంకటేశు గమనించి, ఎవరు కేకలు వేశారు. దీంతో ఆలయం బయట ఉన్న మరో దొంగ వెనుక నుంచి పీకపట్టుకున్నారు. తుపాకీ, కత్తులు చూపి బెదిరించారు. ఆలయంలో ఉన్న మరో ఇద్దరు ముందుగా సీసీ కెమెరాలు ధ్వంసం చేశారు. ముందు గేటు రాకపోయే సరికి, క్యూ గేట్‌ను పగులగొట్టారు. అమ్మవారి మెడలో తాళిబొట్లు, ఇతర వెండి వస్తువులు అపహరించారు. రెండు హుండీలను బయటికి తీసుకొచ్చారు. యేటి ఒడ్డున ఒక హుండీని పగులగొట్టి, అందులోని సొమ్మును తీసుకెళ్లారు. మరో హుండీని ఎత్తుకెళ్లారు. కట్టివేసిన వృద్ధుడిని యేటి గడ్డ వరకు కొట్టుకుంటూ వెళ్లడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. తెల్లవారుజామున 3 గంటల సమయానికి వృద్ధుడు వెంకటేశ్ తేరుకుని.. గుండ్లూరులో ఉంటున్న అర్చకుడు శివ ఇంటికి వెళ్లి విషయం చెప్పాడు. బాధితుడిని వెంటనే నందలూరులో ఉన్న ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లి ప్రాథమిక చికిత్స చేయించారు. తర్వాత పోలీసులకు విషయాన్ని తెలియజేశారు. సమాచారం అందుకున్న రాజంపేట రూరల్ సీఐ మంజునాథరెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈయన వెంట ఎస్ఐ భక్తవత్సలం, నందలూరు ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్‌తోపాటు పోలీసులు ఉన్నారు. చోరీకి పాల్పడిన వారి ఆధారాల కోసం అన్ని సేకరించారు. వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆత్మహత్యకు యత్నించిన యువకుడి మృతి


శ్రీకాంత్ (ఫైల్)

మదనపల్లె : తల్లిదండ్రులు మందలించారనే మనస్తాపంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన శుక్రవారం జరిగింది. మండలంలోని కొండామర్రిపల్లె పంచాయతీ ఇసుకనూతిపల్లెకు చెందిన జేసీబీ రెడ్డెప్ప కుమారుడు శ్రీకాంత్(21) జులాయిగా తిరుగుతుండటంతో గత నెల 29న తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపం చెందిన శ్రీకాంత్ ఇంటి వద్దే పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. గమనించిన తల్లిదండ్రులు వెంటనే జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు బెంగళూరులోని కార్పొరేట్ ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్సలు పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మదనపల్లె తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న లక్ష్మీదేవి

మదనపల్లె : బంధువుల వేధింపులతో మనస్తాపం చెందిన ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన శుక్రవారం పట్టణంలోని రామారావు కాలనీలో జరిగింది. స్థానికంగా నివసిస్తున్న హరినాథ్ భార్య లక్ష్మీదేవి(35)కి తన సొంత ఊరైన కొత్తపల్లె పంచాయతీ దుబ్బిగానిపల్లెలో వారసత్వంగా కొంత ఆస్తి ఉంది. అక్కడికి భర్తతో కలిసి తరచూ వెళ్లేది. ఈ క్రమంలో లక్ష్మీదేవికి తన మేనమామ మల్లికార్జున, తమ్ముడు మురళీ తదితరులతో కొంత కాలంగా ఆస్తి వివాదం నడుస్తోంది. ఇదే విషయమై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఇరువర్గాలకు సర్దిచెప్పి వివాదాస్పద భూమిలోకి వెళ్లవద్దని సూచించారు. అయితే ఆ భూమిని తమ బంధువులు విక్రయిస్తున్నారన్న సమాచారం తెలుసుకుని.. లక్ష్మీదేవి అక్కడకు వెళ్లడంతో ఆమెను వారు సూటిపోటి మాటలతో వేధించారు. దీంతో మనస్తాపం చెందిన లక్ష్మీదేవి శుక్రవారం తెల్లవారుజామున ఇంటి వద్దే ఎలుకల నివారణ మందు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.